


**పాతికేళ్ళ వయసున్న బెంగాలీ అమ్మాయి మాకు ఆఫీసులో హిందీ పాఠాలు చెప్పడానికి వచ్చింది. ఒకరోజు నేను వ్రాసిన పది వాక్యాలు దిద్ది, లైనుకు రెండు తప్పులు చూపించి నన్ను గట్టిగా దులిపేసింది.**

"భూమి స్త్రీ లింగం, ఆకాశం పుల్లింగం, కాగితం పుల్లింగం, కలం స్త్రీ లింగం, పాలు పుల్లింగం, చాయ్ (టీ) స్త్రీ లింగం. ప్రతీ నామవాచకమూ ఏ లింగమో తెలియకుండా వాక్యంలో ఉపయోగిస్తే క్రియా రూపం తప్పయి వాక్యం చెడిపోతుంది" అని కళ్ళు వింతగా తిప్పుతూ భయ పెట్టేసింది.'ఎంచక్కా తెలుగు భాషలో ఈ బాధ లేదు కదా! చాయ్, కాఫీ, రాయీ, రప్పా, అగ్గి పెట్టె, సబ్బుబిళ్ళా అన్నిటినీ ఒకే విధంగా గౌరవించ వచ్చు' అనుకున్నాను మనసులో.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చాను. నా టేబుల్ మీద ఒక కార్డు వుంది. "అన్నీ సీరియస్ కథలే వ్రాయకపోతే కాస్త తేలిక కథలు వ్రాయకూడదా మాష్టారూ!" అని ముగించిన ఉత్తరంలో చివర "మీ అభిమాని -రత్నం" అని క్లుప్తంగా వుంది. నాకు వేడి టీ తెస్తూ నా భార్య రేవతి "మీ అభిమానుల్లో రత్నాలూ, మాణిక్యాలు వున్నట్లు నాకు తెలియదే మేష్టారూ" అని ఎదురైంది. కార్డు ఎక్కడ నుండి వచ్చిందో అని చూశాను. మా ఊరునుండే. తేలికగా నవ్వి "నేను మా ఊరి హైస్కూల్లో ఒక ఏడాది టీచరుగా వెలగబెట్టాను. రత్నం అంటే రత్నాకర్రావుగాడు. నా శిష్యుడు. వాడికి నేనంటే వెర్రి అభిమానం" అన్నాను. రేవతి నా మాట నమ్మిందో లేదో నాకు తెలియదు కానీ అప్పుడు నాకు స్ఫురించింది– తెలుగువాళ్ళు పెట్టుకునే పేర్లు కూడా కొన్ని ఏ లింగమో చెప్పకుండా తికమక పెడ్తాయని! పైడి తల్లి, నాయుడమ్మ, రత్నం ఇలాంటివే.

ఆ తరువాత ఏదో ఆఫీసు పని మీద మద్రాసులో రెండు రోజులూ, బొంబాయిలో మూడు రోజులూ వుండి హైదరాబాద్ వచ్చాను. మద్రాసులో ఒక రోజు సిటీ బస్సు ఎక్కి బస్సుకి ఎడమ వైపు వరుసలోని ఒక సీట్లో కూర్చున్నాను. నా వెనక వరుసలో ఒక మహిళ నన్ను వింతగా చూసింది. ఇంతలో కుడి వేపు వరుసలో కూర్చున్న ఒక పెద్దమనిషి అచ్చ తెలుగులో "మద్రాసుకి కొత్తవారులా వున్నారు. ఇటురండి. ఆ సీట్లు ఆడవారికి ప్రత్యేకం" అన్నాడు. ఈ అనుభవంతో నేను బొంబాయి వెళ్ళి సిటీ బస్సు ఎక్కినప్పుడు కాస్త సందేహించి నిలబడ్డాను. "దారి కడ్డుగా నిలబడడం దేనికి- అక్కడ సీటు ఖాళీగా వుంది కూర్చోరాదూ" అన్నాడు కండక్టరు హిందీలో విసుగ్గా. ఆ ఖాళీ సీటు పక్కనున్న స్త్రీని చూస్తూ బిక్కుబిక్కుమని సందేహిస్తూ కూర్చున్నాను. ఆమె స్నేహ పూర్వకంగా "మీది హైదరాబాద్ అనుకుంటాను. ఇక్కడ స్త్రీలకు ప్రత్యేకంగా సీట్లు లేవు" అని నా సందేహాన్ని అర్థం చేసుకొని నెమ్మదిగా చెప్పింది. ఆమెకు కృతజ్ఞత చెప్పకుంటూ 'సెక్స్ ఈజ్ జియోగ్రాఫికల్' అన్న బెర్ట్రండ్ రస్సెల్ వాక్యం జ్ఞాపకం చేసుకున్నాను. ఎందుకంటే హైదరాబాద్‌లో నేను పొరపాటునైనా మొదటి ఐదు వరుసల్లో కూర్చుని ఎరగను: కాసేంత పరాకుపడి ఖాళీగా వుందని కూర్చుంటే ఏ కాలేజీ అమ్మాయో తరువాత నిలబెట్టి క్లాసు తీసుకుంటుంది. లేదా ఏ ఇన్‌స్పెక్టరో వచ్చి బస్సు దింపి ఫైన్ కట్టిస్తాడు.

ఇలా వుండగా మొన్న ఆటోల స్ట్రైక్ రోజునే నా మరదలు రాకరాక భాగ్యనగరం చూస్తానని వచ్చింది. నేనూ, రేవతీ సిటీ బస్సు ఎక్కించి నాంపల్లి నుండి ఇంటికి తీసుకుని వస్తున్నాం. బస్సు రద్దీగా వున్నా లేడీస్ సీట్లున్న ఒక వరుసలో కిటికీ దగ్గర ఒక శాల్తీ మాత్రమే తలనిండా పూలు ముడుచుకుని కూర్చుంది. ప్రక్కన రెండు సీట్లు ఖాళీగా వున్నాయి. వెంటనే రేవతినీ, మరదల్నీ కూర్చోమని అన్నాను. వాళ్ళు కూర్చోబోయి సందేహించి ముసి ముసి నవ్వులతో నిలుచుండి పోయారు. నాకు చిరాకు వేసింది. పోనీ ఇంకెవ్వరూ కూడా కూర్చోరెందుకూ అన్న అనుమానంతో అటు నిశితంగా చూశాను. సీటులో కూర్చున్న శాల్తీ ప్రశాంతంగా సిగరెట్ తాగుతున్నాది (డు). అప్పుడర్థమైంది ఆడా మగా కూడా ఆ వ్యక్తిని ఎందుకు అంతగా గౌరవిస్తున్నారో. హిందీ పాఠం గుర్తుకు వచ్చింది. ఆర్.టీ.సీ. నియమావళిలో ఈ శాల్తీ ఏ వర్గానికి చెందుతుందో మరి! "మాడవంపిన వింతల్లో ఒకటి నా చెల్లెలు మొదటి రోజే చూసేసింది" అన్నది రేవతి బస్సు దిగుతూ నా చెవిలో.

---

ఈ బహుమతి పొందిన రచనలో మీకు నచ్చిన మినీకథ వివరాలు దిగువ యిచ్చిన కూపన్‌లో నింపి, పోస్టుకార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

—ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన మినీకథ..............................................

రచయిత/రచయిత్రి..............................................

**పేజీ నంబరు:** _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _